

44 ఏళ్లుగా...

- కర్నూలు నగర వినాయక చవితి
- నేడు వినాయక నిమజ్జనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ గణనాథుని ఉత్సవాలకు 44 ఏళ్ల చరిత్ర ఉంది. 1980లో రెండు విగ్రహాలతో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట మించిన్ బజార్, బుధవారపేటలో రెండు విగ్రహాల ఏర్పాటుతో వేడుకలను ప్రారంభించారు. క్రమంగా వినాయక విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 12 వేల విగ్రహాలను ఏర్పాటు చేయగా ఒక్క కర్నూలు నగరంలోనే సుమారు 2400 విగ్రహాలు కొలువుదీరినట్లు ఉత్సవ సమితి ప్రతినిధులు చెప్పారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన విగ్రహాల్లో 45 శాతం మట్టి విగ్రహాలు ఉండటం విశేషం. కర్నూలు గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర, నగరం నడిబొడ్డున కేసీ కాలువలో నిర్వహించే నిమజ్జనోత్సవం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేకతను చాటుతుంది.

వెల్లివిరుస్తున్న మత సామరస్యం

నగరంలో వినాయకచవితి ఉత్సవాల్లో మత సామరస్యం వెల్లివిరుస్తోంది. గతంలో వరుసగా మూడేళ్లు వినాయక నిమజ్జనం, బక్రీద్ పండుగ, ఓసారి మొహర్రం, నిమజ్జనోత్సవం ఒకే రోజున జరుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నగర వాసులు సోదర భావంతో మెలుగుతూ రెండు వేడుకలను విజయవంతం చేశారు. విగ్రహాల వెంట వచ్చే భక్తులకు ముస్లింలు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేయడంతో పాటు పలుచోట్ల అల్పాహారం సైతం అందిస్తుంటారు. ఈ ఏడాది 15న నిమజ్జనం, 16న మిలాదున్ నబి పర్వదినం నిర్వహించుకోనున్నారు. ఈసారి కూడా ఉత్సవాలు ప్రశాంతంగా జరుగుతాయని శాంతి కమిటి ప్రతినిధులు, ఉత్సవ సమితి సభ్యులు భావిస్తున్నారు.

నిమజ్జనం ఎందుకు చేస్తారంటే..

వినాయక చవితి నాటికి వర్షాలు ఊపందుకుంటాయి. వాగులూ, నదులూ ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటాయి. అలాంటి సమయంలో తీరం వెంబడి మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల వరద పోటు తగ్గే అవకాశం ఉంటుంది. పైగా ఈ కాలంలో ప్రవహించే నీటిలో క్రిమికీటకాలు ఎక్కువగా ఉంటాయని అంటారు. నిమజ్జనంలో విడిచే పత్రితో నీరు కూడా క్రిమి రహితంగా మారిపోతుందన్నది పెద్దల మాట. అయితే ప్రకృతి పరమైన విశేషాలతో పాటు ఇందులో సామాజికాంశాలూ లేకపోలేదు. వాడవాడలా వినాయక చవితి విగ్రహాలు వెలసిన తర్వాత, ఇరుగూపొరుగూ కలిసి కోలాహలంగా ఈ వేడుకను జరుపుకుంటారు. మొహమాటాన్ని వీడి నలుగురితో ఆడుతూ పాడుతూ బంధాలను పెంచుకోవడమూ జరుగుతుంది. ఆ వేడుకలోని హోరు శృతి మించడం, ప్రతిష్ట కోసం భారీ రంగు విగ్రహాలను నీటిలో కలపడం.. నిమజ్జనం వెనుక ఉన్న ఉద్దేశాలని దెబ్బతీస్తున్నాయి. ప్రకృతిని కొలవడం, భక్తితో పూజించడం అన్న లక్ష్యాలను పక్కన పెట్టి ప్రకృతి వినాశనానికీ, ఆడంబరానికీ పెద్ద పీట వేస్తున్నాయి.



నగరంలోని వినాయక ఘాట్‌లో ఏర్పాట్లు చేసిన అధికారులు

సీతారాం ఏచూరికి సిపిఎం ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కమ్యూనిస్టు యోధుడు ఎర్రజెండా ముద్దుబిడ్డ విప్లవాల రథసారథి సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కర్నూలు సుందరయ్య జంక్షన్‌లో న్యూ సిటీ నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ. జిల్లా కమిటీ సభ్యులు ఎండి.అంజిబాబు, కె.అరుణ ఎండి.ఆనంద్ బాబు, వై.నగేష్, సి.గురుశేఖర్, కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.ప్రభాకర్, ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప హాజరయ్యారు. సీతారాం ఏచూరి నిలువెత్తు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పదవిలో కొనసాగుతూ కన్నుమూయడం శ్రామిక ప్రజానీకానికి సిపిఎం శ్రేణులకు తీరని లోటు అని అన్నారు. విద్యార్థి ఉద్యమంలోకి 1974లో అడుగిడి జాతీయ నాయకునిగా అంతర్జాతీయ నాయకునిగా ఎదిగి తుదిశ్వాస వరకు మొక్కవోని దీక్షతో ఎర్రబాటలో అగ్రభాగాన నిలిచిన యోధుడు అని అన్నారు. చిన్ననాటి నుండి అధ్యయనానికి ఇచ్చిన ప్రాధాన్యతే జీవితంలో ఆయనను అగ్రస్థానానికి చేర్చింది. గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కావడంతోపాటు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అవ పోసన పట్టడానికి కీలకంగా నిలిచింది. దేశాన్ని పెద్ద బందిఖానాగా మార్చిన ఎమర్జెన్సీ విధించిన ఆనాటి ప్రధాని ఇందిరి గాంధీని జెఎన్‌యును ఛాన్స్‌లర్‌గా రాజీనామా చేయండని విద్యార్థి దశలోనే జెఎన్‌యు అధ్యక్షునిగా ఆమెకు నేరుగా మెమోరాండం సమర్పించిన ధీరోదాత్తుడు ఏచూరి అన్నారు. శ్రమజీవుల సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాడటంతోపాటు పార్లమెంటు లోనూ ప్రజావాణిని వినిపించిన పాలకులను నిలదీశాడు. లౌకిక భారత రాజ్యాంగ మౌలిక స్వభావానికే ముప్పు వాటిల్లుతున్న నేటి వరకూ ఆయా కేంద్రంలోని ప్రజాకంటక ప్రభుత్వాలను గద్దె దించేందుకు జరిగిన అనేక ప్రయత్నాల్లో ఆయన కీలకపాత్ర వహించారన్నారు. యునైటెడ్ ఫ్రంట్ నుండి ఇటీవలి ఇండియా వేదిక వరకు వాటిని సమన్వయం చేయడంలో ఏచూరి కృషి ఆధునిక భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంద న్నారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం పరిరక్షణకు జరిగిన పోరాటాలు, ఉద్యమాల్లో ఏచూరి పాత్ర అద్వితీయమైనదన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్రనేతగా మాత్రమే గాక దేశంలోని యావత్ వామపక్ష శ్రేణులకూ ఆయన పెద్ద దిక్కు. పన్నెండేళ్లు రాజ్యసభ సభ్యునిగా విశేష కృషి చేసిన ఆయనను ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు వరించిందన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.శ్యామల, వి.శంకర్, ఎస్.మహమ్మద్ రఫీ, జి.ఏసు, ఎం. గోపాల్, జెఎన్.శేషయ్య, సి.సాయి, ఎం.లోకేష్, బి.గోపాల్ ,మల్లి, ఎస్. రోశయ్య, మల్లికార్జున, ముత్తయ్య, వెంకటస్వామి, మద్దిలేటి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

- నగరంలో పోలీసుల కవాతు - వీకర్ సెక్షన్ కాలనీ కవాతులో పాల్గొన్న ఎస్‌పి
- సమస్యలుంటే డయల్ 100కు సమాచారమివ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు పోలీసులు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ పోలీసుల కవాతులో జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ హైదారాబాద్ తర్వాత కర్నూలు గణేష్ నిమజ్జనానికి అంత ప్రాధాన్యత ఉందన్నారు. 1100 పై చిలుకు విగ్రహాలు నిమజ్జనం అవుతున్నాయన్నారు. కర్నూలు రేంజ్ డిఐజి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులను కలిపి మొత్తం 1600 మందితో గణేష్ నిమజ్జనం బందోబస్తు కేటాయించామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రత చర్యలు చేపట్టామన్నారు. ఒక్కో విగ్రహానికి ఒక పోలీసును కేటాయించామన్నారు. ఆ విగ్రహం నిమజ్జనం అయ్యే వరకు వారు బాధ్యతగా ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ కెమెరాలు, బాడి ఒన్ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా చట్ట వ్యతి రేక కార్యక్రమాలకు పాల్పడితే గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా బైపాస్‌లో వాహనాలను మళ్ళించామన్నారు. అత్యవసర వాహనాలను మాత్రమే నిమజ్జన రూట్‌లో అనుమతిస్తామన్నారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలుంటే డయల్ 100 గాని, డయల్ 112 గాని పోలీసులకు సమాచారం అందించాలన్నారను. 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ పోలీసుల కవాతులో సిఐలు ప్రసాద్, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, మధుసూధన్ గౌడ్ , శేషయ్య, ఆర్‌ఐ సోమశేఖర్ నాయక్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



పోలీసు కవాతులో పాల్గొన్న ఎస్‌పి బిందుమాధవ్

రెడ్ సెల్యూట్ సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. సీతారాం ఏచూరికి కర్నూలుతో అనుబంధం ఉంది. పలు కార్యక్రమాల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. చాలా సార్లు ఆయన కర్నూలుకు విచ్చేశారు. 2003 నవంబర్ 30న పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గా ఉన్న ఆయన ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 2009 ఎన్నికల్లో సిపిఎం కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎం.ఎ.గఫూర్ పోటీ చేసిన సందర్భంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 2013 మే 19న కర్నూలు సుందయ్య భవన్‌లో నిర్వహించిన సుందరయ్య శత జయంతి ఉత్సవాల్లో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులుగా ఆయన పాల్గొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్స్ మీట్‌లోనూ పాల్గొన్నారు. 2016లో కర్నూలు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిస్టుల బస్సు యాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. 2019 డిసెంబర్ 28న కర్నూలు నగరంలో ఎన్ఆర్‌సి, సిఎఎ, ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శిగా పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల పలువురు వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న కొద్ది మంది మేధావులలో ఏచూరి ఒకరు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రత్యేకతను చాటిచెప్పిన వ్యక్తి ఆయన. 2004లో యూపిఎ వన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారు. పార్లమెంట్‌లో, పార్లమెంటు బయట ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక రకాల సూచనలు, సలహాలు ఇవ్వడంలో ఆయన ముందుండేవారు. ప్రత్యేకించి కర్నూలు జిల్లా ఉద్యమంతో అనేక సందర్భాల్లో ప్రత్యక్ష సంబంధాలు ఆయనకు ఉన్నాయి. విద్యార్థి సంఘం నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం సిపిఎం ప్రధాన కార్యదర్శి వరకూ సాగింది. తెలుగు కుటుంబంలో జన్మించిన ఆయన నవ్వుతూనే ఇతర పార్టీలపై, బిజెపి విధానాలపై విమర్శలు గుప్పించే వారు. లౌకికవాదం కోసం అందరినీ ఏకం చేయడం కోసం బలంగా పని చేశారు. ఆయన ఆశయాలను సాధించడం కోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. రెడ్ సెల్యూట్ కామ్రేడ్ సీతారం ఏచూరి...

జిఒ 115 రగడ : జీవో నెంబర్ 115 స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంల మధ్య చిచ్చు పెడుతోంది. ఏఎన్ఎంలకు రెండేళ్లు శిక్షణ ఇచ్చి నేరుగా స్టాఫ్ నర్సులుగా తీసుకోవాలనే వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్ణయంపై కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు భగ్గుమంటున్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన నాటి నుండి నేటి వరకూ గత 13 సంవత్సరాలుగా శాశ్వత ప్రాతిపదికన ఒక్క ఉద్యోగానికి కూడా నోచుకోని స్టాఫ్ నర్సులు వివిధ కాంట్రాక్ట్‌ల పద్ధతిలో దశాబ్ద కాలంగా ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగాలు ఎప్పటికైనా క్రమబద్ధీకరణ అవుతాయని ఎదురు చూస్తున్న తరుణంలో జీవో 115 జారీ చేయడంతో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తమకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని కందిపప్పు : కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచధార పంపిణీ జరుగుతోంది. కందిపప్పును మాత్రం రెండు నెలలుగా ఇవ్వడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. రెండు నెలలుగా పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పు నీళ్లకు కూడా దూరమయ్యారు.

అవీ..ఇవీ..అన్నీ..

విశాఖ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ప్రభుత్వమే సొంత గనులు కేటాయించాలని, విశాఖపట్నం ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త రస్తారోకో కార్యక్రమంలో భాగంగా జిల్లా వాప్తంగా పలు ప్రాంతాల్లో ఎఐటియుసి, సిఐటియు, ఎఐకెఎస్, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కర్నూలు నగరం మినహా అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నిమర్జన కార్యక్రమాలు నిర్వహించారు.





రాజీమార్గమే రాజ మార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

ప్రజాశక్తి- కర్నూలు లీగల్

కర్నూలు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జాతీయం లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు రాజీమార్గమే రాజ మార్గమని అన్నారు. జీవితంలో ప్రతి వ్యక్తికి సమయం చాలా చాలా విలువైనదని, మనిషి సమయాన్ని వృధా చేయకూడదన్నారు. కక్షిదారులు న్యాయస్థానాలు చుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా సామరస్యంగా చర్చించుకుని లోక్ అదాలత్‌లో పరిష్కరించేసుకొని ప్రశాంతంగా ఉండాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ కాగల క్రిమినల్ కేసులు పరిష్కారం చేస్తామన్నారు. లోకాదాలతో పరిష్కారమైన కేసులకు తిరుగు లేదన్నారు. ఫ్యామిలీ కోర్టు జిల్లా జడ్జి జి.ప్రతిభాదేవి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు కక్షిదారులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో కేసుల సంఖ్య పెరిగిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్టీ కోర్టు జడ్జి పి.పాండురంగారెడ్డి, మహిళా కోర్టు జడ్జి బి.భూపాల్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జిఎల్‌వి శేషాద్రి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, జూనియర్ సివిల్ జడ్జిలు టి.జోష్ణదేవి బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బి కృష్ణమూర్తి న్యాయవాదులు, కక్షిదారులు, రెవిన్యూ, బ్యాంక్ ,పోలీసు అధికారులు పాల్గొన్నారు.



గాడిచర్ల జయంతి సభలో మాట్లాడుతున్న చంద్రశేఖర కల్కూర

దాడిచర్లకు ఘన నివాళి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

జిల్లా కేంద్ర గ్రంథాలయం కర్నూలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చంద్రశేఖర్ కల్కూర , గంగాధర్ రెడ్డి లులైబ్రరీ సిబ్బంది గోవిందరెడ్డి, బాష, చంద్రమ్మ, డిప్యూటీ లైబ్రరీయన్ పెద్దక్క ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్కూర గాడిచర్ల చేసిన సేవలను కొనియాడారు.

నింగికెగిసిన అరుణతార సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నింగికెగిసిన అరుణతార సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. శనివారం సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సూర్జిత్ భవన్‌లో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సీతారాం చిత్రపటానికి పూల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డి. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి ఉద్యమం నుంచి ఎదిగిన తీరు చేసిన పోరాటాలను వివరించారు. సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. విజయ్ ,ఎస్ఎండి షరీఫ్, కె.రామకృష్ణ, పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా అవాజ్ కార్యదర్శి ఎస్ఎ.సుభాన్ సిపిఎం సీనియర్ నాయకులు రాజగోపాల్, పార్వతయ్య పార్టీనగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఆటో కార్మిక సంఘం సిఐటియు కర్నూలు న్యూ సిటీకమిటీ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో ఆటోకార్మికులు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.



సూర్జిత్ భవన్‌లో నివాళ్లు అర్పిస్తున్న గౌస్ దేశాయి, తదితరులు

సీతారాం ఏచూరికి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన నివాళి అర్పించారు. డివైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడారు.



సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో

కర్నూలు కార్పొరేషన్: ఏచూరికి సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు, కె. రామకృష్ణ ,నాయకులు, ఆర్.కృష్ణ, కె.రాముడు. ఘనంగా నివాళులు అర్పించారు.

కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు జి.మధు సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు రంగస్వామి, నాగమ్మ పాల్గొన్నారు.

వెల్దుర్తి : వెల్దుర్తి మండల కేంద్రంలోని మోటర్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆఫీసులో సీతారాం ఏచూరికి సిఐటియు మండల అధ్యక్షులు రాజు, సిపిఎం మండల నాయకులు మారేన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూయడం అత్యంత బాధాకరమన్నారు.

పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం ఎపిటిఎఫ్

80 వసంతాల వేడుకలో ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) 80 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భం , విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించడం శుభపరిణామమని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాడు నాగరాజు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్పోరేషన్ హాల్లో ఎపిటిఎఫ్ జిల్లా విద్యా మహాసభ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్.ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ బస్తిపాడు నాగరాజు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ 80 యేళ్లు పూర్తి చేసుకోవడం ఈ పరంపరలో భాద్యతలు చేపట్టిన నాయకత్వాన్ని పరిశీలిస్తే పోరాట స్ఫూర్తి గల సంఘంగా , ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాట సంస్థగా ఉందని అన్నారు. ఎపిటిఎఫ్ ఇటు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంతోపాటు ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం సమాజ శ్రేయస్సు కోసం పాటుపడడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యారంగ – ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుటకు ఈ ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. 117 జి.ఓ రద్దు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విద్య , వైద్యం అభివృద్ధికి పనిచేస్తామని అన్నారు. ఎపిటిఎఫ్ మహాసభల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ చరిత్రను,నాయకత్వ పటిమను వివరించారు. పోరాటాలతో నేడు ఉపాధ్యాయులు పొందుతున్న అన్ని సౌకర్యాలు ఎపిటిఎఫ్ ద్వారా వచ్చాయని తెలిపారు. ప్రస్తుత విద్యారంగ సమస్యలు ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు లేవని, బోధనకు ఆటంకంగా అన్ని అనవసర కృత్యాలను తొలగించాలని, మీడియం , సిలబస్ , తరగతుల విలీనం పై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్క్అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ కుదరదని 3000 అకడమిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్‌ను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐఫియు జాతీయ చీఫ్ పాట్రాన్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో హింసాత్మక ప్రవృత్తి – విపరీత ధోరణులు – పరిష్కారాలు అనే అంశంపై చర్చించారు. డైట్ సీనియర్ లెక్చరర్ సమాజంలో మార్పులు – ఉపాధ్యాయుని పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి మరియానందం కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి కె.కులశేఖర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మధుసూదన్ రావు, మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు, ఎంఇఒలు పాల్గొన్నారు.



ఎపిటిఎఫ్ విద్యా వైజ్ఞానిక సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

పర్యావరణ హితం కోరడం అభినందనీయం

మొక్కలునాటి, అన్నదానం చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



వినాయక చవితి సందర్భంగా జర్నలిస్టులు మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న మీడియా సెంటర్‌వద్ద పాత్రికేయ గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వివరించారు. రానున్న రోజుల్లో మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడం ద్వారా దేశానికే కర్నూలు నగరం మార్గదర్శనం కావాలని కోరారు. సాధారణంగా వినాయక చవితి సందర్భంగా ప్రమాదకర రసాయనాలతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తారని, వాటిని నీటిలో విభజన చేయడం ద్వారా నీటి కాలుష్యం, వాయు కాలు కాలుష్యం కలిగి దుష్ఫలితాలు ఏర్పడతాయని వివరించారు. జర్నలిస్టులు ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి మార్గదర్శకులుగా మారారన్నారు. జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద అన్నదానం చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అందరికీ వినాయకుని ఆశీస్సులు అంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ,శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డాక్టర్ శంకర్ శర్మ కోరారు.

కోడుమూరులో దొంగల బీభత్సం

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కర్నూలు జిల్లా కోడుమూరులో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మహబూబ్ బాషా ట్రేడర్స్‌లో రాత్రివేళ దొంగలు పైకప్పు రేకులను కోసి అందులోని బియ్యం ప్యాకెట్లు, నూనె డబ్బాలు, నగదు మొత్తం రూ.50 వేలు దోచుకుని వెళ్లారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని చోరీ వివరాలు తెలుసుకుంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫింగర్‌ప్రింట్ ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి

- సిపిఎం మండల కార్యదర్శి జయరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం


మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దామని సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు తెలిపారు. శనివారం స్థానిక ప్రయివేట్ లాడ్జిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీతారాం ఏచూరి మరణం బాధాకరమని తెలిపారు. సిపిఎం కార్యకర్తలు బి.అనిల్, టి.లక్ష్మన్న, టి.ప్రాణేష్, హెచ్.రాజన్న, హెచ్.దానియేలు, వీరేష్, కరుణమ్మ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు సంతాప సభ నిర్వహించారు. హమాలీ కార్మికులు రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

సెంట్రింగ్ యూనియన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - నందవరం


ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

బాధిత కుటుంబానికి సెంట్రింగ్ యూనియన్ ఆర్థిక సహాయం అందజేసింది. మండలంలోని హాలహర్వి గ్రామానికి చెందిన సక్కెర రవి ఇటీవల సెంట్రింగ్ పని నిమిత్తం మంత్రాలయం వెళ్లి ప్రమాదవశత్తు మృతి చెందినన సంఘటన తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు సెంట్రింగ్ యూనియన్ రవి భార్య రత్నమ్మకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేసింది. శనివారం యూనియన్ సభ్యులు మాట్లాడారు. ప్రమాదవశత్తు మృతి చెందిన రవి కుటుంబానికి యూనియన్ తరపున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ నగదు పిల్లల చదువుకు వినియోగించాలని కోరారు. కుటుంబానికి తోడుగా ఉంటామని, పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకు సహాయం అందజేసి ఆదుకుంటామని తెలిపారు. ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నందుకు యూనియన్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

అధిక సాంద్రత పత్తి సాగులో అధిక దిగుబడులు

- కెవికె సమన్వయ కర్త రాఘవేంద్ర చౌదరి


పత్తి దిగుబడిని పరిశీలిస్తున్న రాఘవేంద్ర చౌదరి


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అధిక సాంద్రత పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చన కెవికె ప్రోగ్రామ్ సమన్వయకర్త రాఘవేంద్ర చౌదరి తెలిపారు. పెద్దకడబూరు మండలం హెచ్.మురవని గ్రామంలో చేపట్టిన అధిక సాంద్రత పత్తి సాగు విధానంలో సాగు చేసిన పత్తి పంటలో శనివారం బనవాసి కెవికె, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దకడబూరు మండలం రంగాపురం, హెచ్.మురవని గ్రామంలో అధిక సాంద్రత పత్తి విధానంలో పత్తి సాగు చేపట్టినట్లు తెలిపారు. నూజివీడు సిరి, సిసిహెచ్ 369 రకాలను సాగు చేసినట్లు చెప్పారు. అధిక సాంద్రత పత్తి సభ్యుడు రవీంద్ర, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు కరుణప్ప, హుస్సేన్, రైతు కాలప్ప ఆచారి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా విరాళాల సేకరణ

ప్రజాశక్తి - కౌతాళం

విజయవాడ వరద బాధితుల కోసం పార్టీలకతీతంగా ప్రజలు విరాళాలు అందిస్తున్నారని టిడిపి టౌన్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి వరద బాధితుల కోసం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా విరాళాలు అందించడం మంచి పరిణామమని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల సర్వం కోల్పోయిన బాధితులకు తమవంతు సహకారం అందించడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయమని తెలిపారు. సర్పంచి పాల్ దినకరన్, ఉప సర్పంచి తిక్కయ్య, రామకృష్ణ, టిడిపి నాయకులు మంజు, చౌదరి సోమన్న, రెహమాన్ పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

ప్రబలుతున్న జ్వరాలు

- ఒకే మంచంపై ఇద్దరికి వైద్యం
- చివరికీ కుర్చీపైనా
- రద్దీగా ఒపి విభాగం
- ఇదీ ప్రభుత్వాస్పత్రిలో దుస్థితి...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గత వారం, పది రోజుల్లో కురుస్తున్న వర్షానికి, వాతావరణంలో మార్పులతో జ్వరాలు ప్రబలుతున్నాయి. డబ్బులున్న వారు కార్పొరేట్, ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్తుంటే పేదలు ప్రభుత్వాస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రోజుకు 200 నుంచి 300కు పైగా ఒపిలు వస్తున్నాయి. కొన్ని వార్డుల్లో ఒక్కో మంచం మీద ఇద్దరిని పడుకోబెడుతున్నారు. చివరకు కుర్చీలో కూడా పడుకోబెట్టి చికిత్స చేయాల్సి వస్తోంది. జ్వరాలతో ఎక్కువ కేసులు రావడమే ఈ దుస్థితికి కారణమని ఆస్పత్రి సిబ్బంది పేర్కొంటున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా ఆదోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పార్థసారథి ఒక్కసారి ఆస్పత్రి వైపు చూసి పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ ప్రాంత ప్రజలు, రోగులు కోరుతున్నారు.

అపరిశుభ్రతకు నిలయం.. ఆస్పత్రి

ఆదోని ప్రభుత్వాస్పత్రి ప్రధాన ద్వారం వద్ద వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. ఆస్పత్రిలోకి ప్రవేశించాలంటే బురదను తొక్కుకుంటూ వెళ్లాల్సిందే. ఆస్పత్రి అపరిశుభ్రంగా నిలయంగా మారింది.


ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురికి వైద్యమందిస్తున్న సిబ్బంది

అందుబాటులో ఉండని వైద్యులు

వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో ఆదోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల పని తీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్టుగా ఉంది. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండక వైద్యమందక రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి రోజూ 300లకు పైనే ఒపిలు వస్తున్నాయి. అన్ని రోగాలకూ ఒక్కటే మందు అన్న చందంగా వైద్యులు ఉంటున్నారు. ఇక్కడ పని చేసే వైద్యులు ఇష్టానుసారం విధులకు హాజరవుతున్నారు. ఎవరైనా ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రికి వస్తే మొక్కుబడి వైద్యం చేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేక రోగులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విధులకు డుమ్మా కొడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెట్టిందే తినాలి

ఎడతెరపీ లేని వర్షాలతో వ్యాధులు ముసురుకుంటున్నాయి. ఈ తరుణంలో వివిధ సమస్యలతో బాధపడుతూ రోగులు ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. చికిత్స కోసం రెండు, మూడు రోజులు ఆస్పత్రిలోనే ఉంటున్నారు. వీరికి పాలు, అల్పాహారం మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాల్సి ఉంది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఉడికి, ఉడకని అన్నం, నీళ్లచారు, పప్పు పెట్టి ఆహార పట్టికను అటకెక్కించారు. కొందరు రోగులకు పెడితే మరికొందరికి అందదు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆస్పత్రిలో ఇస్తున్న అన్నం సరిగ్గా లేక ఒక రోగి ఇంటి నుంచి తెచ్చుకున్న అన్నం, కారంపొడితో భోజనం చేశారు.

పడకేసిన గ్రామీణ దవాఖానాలు

పెద్దహరివాణం, పెద్దతుంబలం పిహెచ్‌సిలో జనాభా అత్యధికంగా కలిగిన ప్రాథమిక వైద్యశాల తప్ప మరొకటి లేక పేదలు అవస్థలు పడుతున్నారు. పేదలకు సుస్తి చేసి ఆరోగ్య కేంద్రానికి వెళితే జ్వరం, దగ్గు బిళ్లలు తప్ప పూర్తిస్థాయి వైద్యమందే పరిస్థితి లేదు. రోగం వస్తే ఆదోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలి. దూరం కావడంతో గత్యంతరం లేక ప్రాణాలు దక్కించుకోవటానికి పల్లె వైద్యులు, ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ అక్కడ పని చేస్తున్న ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలు సరైన సమయానికి రావడం లేదు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే మందులు కరువైతే ఇక పల్లె దావఖానాల పరిస్థితి చెప్పనవసరం లేదు. పేరుకే హెల్త్ సెంటర్లు తప్ప వసతులు లేవు. స్ట్రెచర్‌లుండవు. సూదు మందుల నిల్వకు శీతల యంత్రాలుండవు. కూర్చునే కుర్చీలు లేక దాతల సహాయాన్ని సిబ్బంది అర్థిస్తున్నారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎంలు పని చేయాల్సి ఉంది. తర్వాత వైద్యుల స్థానంలో ఎంఎల్‌హెచ్‌పి (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) నియమించారు. అరకొర మందుల సరఫరా మాత్రమే జరుగుతోంది. వాటిలోనే క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో పంపిణీ చేయాల్సి ఉండడంతో రోగులకు ఒకటి, రెండు గోళీలు మాత్రమే ఇచ్చి సరిపుచ్చుతున్నారు. మందుల కొరతతో సిబ్బంది సర్వేలు, సమీక్షలకే పరిమితమవుతున్నారు.


కుర్చీపై పడుకున్న బాలుడు

మంచి బోధనతో గుర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో ఎమ్మెల్యే

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధిస్తూ అవార్డు గ్రహీతలు మరింత గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శనివారం మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ బి.మహాదేవప్ప అధ్యక్షత వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్.వెంకోబ, ఎం.నరసింహా రెడ్డి, వై.వెంకట సుబ్బయ్య, టి.ఎల్లప్ప, ఎన్.రాజా సతీష్‌కు ఎమ్మెల్యే పార్థసారథి, ఎస్‌టియు నాయకులు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు గోకారి, నాయకులు సి.నాగరాజు, బి.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, బి.సుంకన్న, జి.వీరచంద్ర యాదవ్, రమేష్ నాయుడు, ఎంసి.సుంకన్న, ఎం.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, కె.మల్లికార్జున, రామాంజనేయులు ఉన్నారు.

విజయవాడ వరద బాధితులకు

పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విజయవాడ వరద బాధితులకు పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. మల్లెల గ్రూపు అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు పిలుపు మేరకు పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీలో ఉన్న పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేద అనాథ బాలబాలికల సంరక్షణ కేంద్రం వారు విరాళాలు సేకరించారు. శనివారం పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు నందవరం, కలుగొట్ల గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి 10 సంచుల బియ్యం సేకరించారు. కృష్ణ, సురేష్, పెద్దయ్య, మనోహర్, ఎర్రన్న, సందీప్, ప్రవీణ్, రంగస్వామి, రమేష్, పవన్, రవి, రాజేష్, భరత్, దావీదు, మిథున్, వ్యవస్థాపకులు సింగనేటి నరసన్నలు సేకరించారు. ఈ బియ్యం సంచులను మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజుకు అందజేశారు.


మల్లెల ఆల్ఫ్రెడ్ రాజుకు అందిస్తున్న సొసైటీ సభ్యులు, విద్యార్థులు

అధ్వాన స్థితిలో అడ్డ రోడ్లు

- గుంతల పడి కంకర తేలిన రోడ్లు
- రోడ్లకిరువైపులా ముళ్ల చెట్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

గుంతకల్లు టు ఆలూరు వెళ్లే ప్రధాన రహదారి నుంచి గ్రామాల్లోకి వెళ్లే అడ్డరోడ్లన్నీ గుంతలు పడి కంకర తేలి అధ్వానస్థితిలో ఉన్నాయి. ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉందని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి మండలంలో చాలా గ్రామాలకు ప్రధాన రహదారి నుంచి గ్రామాల్లోకి వెళ్లే రోడ్లు ఉన్నాయి. రామదుర్గం బస్సు స్టేజి నుంచి రామదుర్గం గ్రామంలోకి వెళ్లే రహదారి, తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డ రోడ్డు, నేమకల్లు బస్ స్టేజి నుంచి నేమకల్లు, సంఘాల గ్రామాల్లోకి, అలాగే కుందనగుర్తి అడ్డు రోడ్డు ఇవన్నీ అధ్వాన స్థితిలో ఉన్నాయి. ఈ రోడ్ల గూండా ప్రయాణాలు చేయాలంటేనే భయమేస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో రాత్రి సమయంలో బస్సులు దిగి గ్రామాల్లోకి నడిచి పోవాలంటే కూడా ఇబ్బందిగా ఉందని, దీనికి తోడు రోడ్డుకిరువైపులా ముళ్ల చెట్లు పెరిగిపోయాయని పేర్కొంటున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో విషసర్పాలు తిరుగుతుంటాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులందరూ పొలాలకు ఎరువులు, విత్తనాలు కొని తెచ్చుకోవడానికి ఈ రోడ్ల పరిస్థితి చూసి వెనకడగేస్తున్నారు. చిప్పగిరి నుంచి ఏరూరు గ్రామానికి వెళ్లే 8 కిలోమీటర్ల రహదారి అంతా అడుగడుగునా గుంతలు పడి కంకర తేలి ఉన్నాయి. తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని ఈ అధ్వాన రహదారి గూండా రోజూ ప్రయాణం చేసే దేగులపాడు, ఏరూరు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఏరూరు రహదారిని, గ్రామాలకు వెళ్లే అడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుంతలు పడి కంకర తేలిన నేమకల్లు అడ్డరోడ్డు

ఆదోని జోనల్ స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతేడాది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదోని జోనల్ స్థాయి ఇండోర్, అవుట్‌డోర్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ రెడ్డి, డాక్టర్ సైఫుల్లా తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం మల్లికార్జున విద్యాలయ హైస్కూల్‌లో ఇండోర్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22న అవుట్‌డోర్ గేమ్స్‌ను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదోని జోనల్ స్థాయి పోటీల్లో 50 పాఠశాలల నుంచి 3 వేల మంది విద్యార్థులు పాల్గొననున్నారని చెప్పారు. ఇండోర్ గేమ్స్ చెస్, రూబిక్ క్యూబ్, డ్రాయింగ్, ఎలిక్యూషన్, క్విజ్, అవుట్‌డోర్ గేమ్స్ బాలుర కోసం ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రో బాల్, కబడ్డీ, డార్జ్ బాల్, లాంగ్ జంప్, షాట్ పుట్, జావిలిన్ త్రో, బాలికల కోసం త్రో బాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, లాంగ్ జంప్, షాట్ పుట్‌తో పాటు పరుగు పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు జరిగే ఇండోర్ గేమ్స్‌లో దాదాపు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. భోజన వసతి కల్పించేందుకు సహాయ, సహకారాలు అందించిన పట్టణంలోని వివిధ అసోసియేషన్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, భరత్ షా, సునీల్ రెడ్డి, యూత్ యాక్టివిటీస్ ఇన్‌ఛార్జి సాబీర్ అహ్మద్, హుస్సేన్ బాషా ఉన్నారు.


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

సెబ్ రద్దు హర్షణీయం : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న సమయంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను రద్దు చేయడం హర్షణీయమని ఎక్సైజ్ సిఐ భార్గవ రెడ్డి తెలిపారు. శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సిఐ భార్గవ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. హెడ్ కానిస్టేబుల్ లింగ ప్రసాద్, కానిస్టేబుల్ ఇందుమతి, రాధమ్మ, నరసింహులు, లక్ష్మన్న పాల్గొన్నారు.


చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున సిబ్బంది

'సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు'

ప్రజాశక్తి - గోనెగండ్ల

సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్‌పి మార్కెట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని హెచ్.కైరవాడి, పెద్దనేలటూరు గ్రామాల్లో రైతు సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ... పంట సాగులో రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల పంట ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయని తెలిపారు. క్రమంగా భూసారం తగ్గిపోయి పంట దిగుబడులు తగ్గుతాయన్నారు. వినూత్న జిఎం శ్రీనివాస్ రెడ్డి, ఎఎస్ ఎం.లింగన్న, ఫీల్డ్ స్టాఫ్ నాగేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు చేస్తే సహించం

- ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని ఎంఆర్‌పిఎస్ నాయకులు హెచ్చరించారు. శనివారం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, రాష్ట్ర నాయకులు కోడుమూరు ఆంధ్రయ్య మాదిగ, ఆదోని బండారి హనుమంతు మాదిగ, జి.ఆనంద్ చైతన్య మాదిగ, జిల్లా అధ్యక్షులు రెడ్డి పోగు భాస్కర్ మాదిగ మాట్లాడారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో స్తంభానికి కట్టేసి కొట్టిన బాధితురాలు దళిత గోవిందమ్మను పరామర్శించినట్లు తెలిపారు. గోవిందమ్మ కుమారుడు ఈరన్న బీసీ చాకలి సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మిని ప్రేమ పెళ్లి చేసుకున్నారని గోవిందమ్మను విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టడం దారుణమని చెప్పారు. బాధితురాలికి న్యాయం జరిగేలా కలెక్టర్, ఎస్పీ కల్లుకుంట గ్రామాన్ని సందర్శించాలని కోరారు. నిందితులను జైలుకు పంపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి పసెద్దుల మహదేవ్ మాదిగ, హాలహర్వి గంధాలం ప్రభాకర్ మాదిగ, దేవన్న మాదిగ, గార్లదిన్నె పౌలు మాదిగ, కారుమంచి రాముడు మాదిగ, కైరవాడి దేవేంద్ర మాదిగ, కోసిగి మండల నాయకులు దుర్గప్ప మాదిగ, నాగరాజు మాదిగ, నరసింహులు మాదిగ, కోడి ఉరుకుంద, సన్నకి ఈరన్న (చిన్న) మాదిగ, కౌతాళం మండల నాయకులు ఆనంద్ మాదిగ, సురేష్ మాదిగ, రామాంజి మాదిగ పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న నాయకులు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం


కౌతాళంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పట్టణంలోని ప్రతిభ హైస్కూల్‌లో హిందీ భాషా దినోత్సవం హిందీ ఉపాధ్యాయిని ముంతాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉపాధ్యాయులు హిందీ కవుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష మాట్లాడారు. జాతీయ ఉద్యమంలో అఖిలభారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు ఉపయోగపడిన భాష హిందీ అని తెలిపారు. ప్రస్తుతం ఆంగ్లంతో పాటు హిందీ భాష చాలా అవసరమని చెప్పారు. ప్రతి విద్యార్థి భాషను నిర్లక్ష్యం చేయకుండా అందులో నైపుణ్యం సంపాదించి భవిష్యత్తులో ఏ ప్రాంతంలోనైనా జీవనోపాధికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులకు విద్యార్థులు సన్మానం చేశారు. హిందీ భాష గొప్పతనం గురించి విద్యార్థులు ప్రత్యేక సాంస్కృతిక నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, శిరీష, భీమేష్, ఖాజా పీర్, విరుపాక్షి, ఈరన్న, సునీల్, శీను, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో హిందీ భాష దినోత్సవం ప్రిన్సిపల్ వి.సంజన అధ్యక్షతన జరిగింది. హిందీలో 99 మార్కులు సాధించిన ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీనియర్ అధ్యాపకులు, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు ఎం.గోవిందరాజులు, జిబి.వేదవతి, చిట్టి ప్రసాద్, హిందీ అధ్యాపకులు శ్రీనివాసులు, రాజేశ్వరి, కాంతమ్మ, ప్రభావతి, బాబు, సూరిబాబు, రంగన్న, ఈరన్న, శివయ్య కీర్తి, మహ్మద్ బాష, సాధిక్ బాష పాల్గొన్నారు.

17న వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 17న వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ సుహాసినమ్మ, నీతి అయోగ్ అస్పిరేషనల్ బ్లాక్ సమన్వయకర్త రవిశంకర్ తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. మోటర్ సైకిళ్లు16, వీల్ ఛైర్లు 13, ట్రై సైకిళ్లు 47 వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వికలాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు.

టిడిపి రెండు నాలుకల ధోరణి

- వైసిపి నాయకుల విమర్శ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని టిడిపి నాయకులు రెండు నాలుకల ధోరణి ప్రదర్శిస్తున్నారని వైసిపి నాయకులు విమర్శించారు. శనివారం వైసిపి మండల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డిని గడ్డం నారాయణరెడ్డి విమర్శించారని, ఎమ్మెల్యేను విమర్శించే అర్హత ఆయనకు లేదని టిడిపి నాయకులు అనడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎల్ఎల్‌సి డైరెక్టర్ పదవి గడ్డం నారాయణరెడ్డికి పనితీరును బట్టి వచ్చిందని చెప్పారు. ఇప్పటివరకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా కాంగ్రెస్ మద్దతుతో ఒక్కడే గ్రామంలో సర్పంచిని గెలిపించుకున్న సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉంటుందని తెలిపారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు అంటేనే బీవీ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీవీ.మోహన్ రెడ్డి గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు శంకుస్థాపన మాత్రమే చేశారని, ఆ ప్రాజెక్టును పూర్తిగా చేసింది చెన్నకేశవరెడ్డి అని తెలిపారు. బీవీ.జయనాగేశ్వరరెడ్డికి గురురాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి పాత్ర లేదని చెప్పారు. చిలకలడోన రిజర్వాయర్‌పై, అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిపై గడ్డం నారాయణరెడ్డి విమర్శిస్తే అప్పుడు మీరే ఆయనను అభినందించారని గుర్తు చేశారు. అదే విషయంపై ఎమ్మెల్యే బీవీపై విమర్శలు చేస్తే విమర్శించే స్థాయి లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు చుక్క మల్లేష్ బసవరాజు గౌడ్, మాచాపురం నాయకులు కోటేశ్వరరావు, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సప్పోగు దానం, హాలహర్వి నాయకులు శ్రీనివాసులు, శాంతిరాజు, ఆనంద్, ప్రకాశం, జయరాజు, తలారి తిక్కయ్య, దుబ్బా నల్లన్న, కె.రంగన్న పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మెల్యే బీవీ సహకారంతో

14వ వార్డు అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి సహకారంతో పట్టణంలోని 14వ వార్డును అభివృద్ధి చేస్తున్నట్లు టిడిపి 14వ వార్డు ఇన్‌ఛార్జీ నవాజ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని 14వ వార్డులో పర్యటించినప్పుడు రోడ్డు, డ్రైయినేజీ లేక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎమ్మెల్యే బీవీ స్పందిస్తూ ఈ సమస్యను నెల రోజుల్లోపు పరిష్కరిస్తామని హామీఇచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం 14వ వార్డులో తాయమ్మ కాలనీ దగ్గర సుమారు రూ.11 లక్షలతో సిసి రోడ్డు, డ్రైయినేజీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే వార్డు అభివృద్ధి కోసం రూ.32 లక్షలు ఎమ్మెల్యే కేటాయించినట్లు చెప్పారు. ఆ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వార్డు సభ్యులు మల్లేష్, లక్ష్మన్న, వీరేష్, అల్తాఫ్ పాల్గొన్నారు.


పనులు చేయిస్తున్న నవాజ్

అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు

- కోగిలతోటలో ఓ మహిళ ఆవేదన

ప్రజాశక్తి - హోళగుంద



తమ భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని ఓ మహిళ వాపోయారు. శనివారం మండలంలోని కోగిలతోట గ్రామానికి వరలక్ష్మి మాట్లాడారు. గ్రామంలోని సర్వే నెంబర్ 128/2లో ఎకరా 42 సెంట్ల వారసత్వ భూమి తనకు ఉందని తెలిపారు. 50 ఏళ్ల నుంచి ఆ భూమిని తామే సాగు చేస్తున్నామని, కొన్నేళ్ల క్రితం తన భర్త అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. అదే సర్వే నెంబర్ పక్కన భూమి ఉన్న వెంకటేష్ రెడ్డి అక్రమంగా తమ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని చెప్పారు. ఇప్పుడు తాము సాగు చేస్తున్న భూమి తమదని, భూమిని దౌర్జన్యంగా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలంటూ కోరారు.